క్లుప్తంగా

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం



గొబ్బెమ్మ ముందు పాటలు పాడుతున్న మహిళలు

పెనగలూరు : మండల కేంద్రంలోని అరుంధతి వాడలో ఆదివారం ఉదయం గొబ్బెమ్మను ఘనంగా నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి గ్రామంలో ఊరేగింపు చేసి ఆదివారం ఉదయం గుంజనేరులో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవం సందర్భంగా మహిళల ఆటపాటలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవత సంస్థ సభ్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. శిబిరంలో 150 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ మెడికల్ క్యాంపులో వైద్యులు ఆర్.శ్రీధర్ రెడ్డి, వినూత్న ప్రసాద్, ప్రసాద్ రెడ్డి, రాయవరం మెడికల్ ఆఫీసర్ శ్వేత, మానవత సంస్థ సభ్యులు గంగిరెడ్డి, మహబూబ్ బాషా, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్ వితరణ



స్పీకర్ అందజేస్తున్న దాతలు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామ సర్పంచ్ దంపతులు సిద్దు, హలీమాలు రూ.15 వేలు విలువజేసే 60 వాట్స్ వైర్‌లెస్ స్పీకర్ మౌత్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ ప్రార్థనా సమావేశానికి, పాఠశాల సమావేశాలు జరిగినప్పుడు మాట్లాడటానికి ఈ స్పీకర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కోటలో పర్యాటకుల సందడి

సిద్దవటం : మండల కేంద్రంలోని మట్లిరాజుల కోటలో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. మట్లి రాజుల కోటకు కడప, చెన్నూరు, కమలాపురం, రాజంపేట, ఒంటిమిట్ట మండలాలకు చెందిన పర్యాటకులు కోటను సందర్శించి కోటలోని మొదటి, రెండవ మండపాలు ఈద్గా, శిలా శాసనం, మూతి విరిగిన నంది విగ్రహం, కోనేరు, త్వకాల్లో బయల్పడిన శివలింగం, కామాక్షమ్మ అమవారి గుడి, బిస్మిల్లా షా ఖాద్రి దర్గా, రాణి మహల్ వంటి కట్టడాలను రాతి స్తంబాలకు ఉన్న శిల్ప సంపదను పర్యాటకులు తిలకించారు. కోటలో మెరుగైన వసతులు కల్పించాలని పర్యాటకులు తెలియజేశారు.


వివాహ వేడుకలో ప్రముఖులు



వివాహ వేడుకలో పాల్గొన్న ఆకేపాటి, అంజద్‌బాషా

రాజంపేట టౌన్ : పట్టణ శివారుల్లోని అశోక్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన పుల్లంపేట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ కుమార్తె వివాహంలో రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వివాహ వేడుకలో పాల్గొని పెళ్లికుమారుడికి వివాహ శుభాకాంక్షలు నూతన వధూవరులు నిండునూరేళ్లు ఆనందకరమైన జీవనం సాగించాలని ఆశీర్వదించారు.

నివాళి



మంగమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల గ్రామ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ అత్త ఈడిగపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తుమ్మల వెంకటరమణ (దళపతి) భార్య, రిటైర్డ్ టీచర్ తుమ్మల మంగమ్మ(85) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మద్దిరేవుల సురేంద్రనాథ్ రెడ్డి, ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాజులు మంగమ్మ మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితోపాటు రవిరెడ్డి, గంగయ్య, రాఘవరెడ్డి, చిన్న వెంకటరమణ, వెంకటరామిరెడ్డి, దిలీప్ రాజు, సుబ్బయ్య, రమణ, సుబ్బరాయుడు, శ్రీనివాసులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

మల్చింగ్‌తో బహుళ ప్రయోజనాలు

- కలుపు సమస్య ఉండదంటున్న రైతులు, అధికారులు
- ఒకసారి కొంటే రెండు పంటలకు వినియోగించవచ్చంటూ సూచన



మల్చింగ్ షీట్ విధానంతో రైతులు సాగుచేసిన దోస పంట

సిద్దవటం : వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉద్యాన పంటలను సాగు చేయాలంటే రైతన్నలకు కష్టంగా మారింది. ఆరుగాలం కష్టించినా పండ్ల తోటలు వేసే రైతులు ఆదాయం చూడలేకున్నారు. ఉద్యాన పంటలను మల్చింగ్ విధానం ద్వార పండిస్తే మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుందని అధికారులు అంటున్నారు. ఈ విధానం అనుసరిస్తే క్రిమీ కీటకాలు, చీడ, పీడల బెడద కూడా ఉండదని తెలుపుతున్నారు. భూమిలో వేసిన ఎరువులు ఆవిరి కాకుండా వంద శాతం మొక్కలకు ఉపయోగ పడుతుంది. మండలంలోని శాఖరాజుపల్లె, బాపనపల్లె, మాధవరం-2, ఉప్పరపల్లె, బొగ్గిడివారిపల్లె, పెద్దపల్లి, మూలపల్లె, మాచుపల్లె, వెలుగుపల్లె , జ్యోతి తదితర గ్రామాల్లో మల్చింగ్ షీట్ విధానంలో ఇప్పటి వరకు కుందన్ రకానికి చెందిన దోస పంటను వంద ఎకరాల్లో, నిర్మల రకానికి చెందిన దోస పంట 20 ఎకరాల్లో సాగైంది. ఈ పంటలు 210 ఎకరాలు సాగయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక ఎకరా దోస పంట సాగు చేసేందుకు రూ. 7వేలు మల్చింగ్ షీట్ ఖర్చు అవుతుంది. ఒక సారి ప్రభుత్వం ద్వారా రాయితీ పొందిన రైతుకు మరోసారి రాయితీ ఇవ్వరని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక ఎకరా దోస పంట సాగు చేయాలంటే రూ. 90 వేల నుంచి ఒక లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుంది. మల్చింగ్ విధానం ద్వారా పంటను సాగుచేస్తే భూమిలోని తేమను సంరక్షిస్తుంది. మొక్కకు తగిన సూక్ష్మ వాతావరణాన్ని కల్పిస్తుంది. దీంతో అధిక దిగుబడులు వస్తాయి. పంటలో కలుపును పూర్తిగా నివారించవచ్చు. భూమిలో ఉండే చీడ, పీడలకు కారణమైన బ్యాక్టీరియా, శిలీంద్రాలు పూర్తిగా నాశనమవుతాయి. మల్చింగ్ షీట్ పైభాగంలో ఉండే సిల్వర్ కలర్ వాడకం వల్ల క్రిమీ కీటకాలు దరిచేరవు. పంట చేతికి వచ్చేలోపు డ్రిప్ ద్వారా వేసిన ఎరువులు పూర్తి స్థాయిలో మొక్కలు అందుకుని దిగుబడులు పెరుగుతాయి. తేలికగా ఆవిరయ్యే గుణమున్న యూరియా, డీఏపీ, అమ్మోనియా వంటి ఎరువులను ఈ పద్ధతిలో వేయడం వల్ల వంద శాతం మొక్కలకు చేరి ఆశాజనకంగా దిగుబడిని ఇస్తాయి. భూమి బాగా గుల్లబారి సమయానుకూలంగా మొక్కలకు కావలసిన నీరు, లవణాలు, పోషకాలు అందుబాటులో ఉంటాయి. భూమిలో సేంద్రియ, సేంద్రియ పదార్థం పెరుగుతుంది. ఒక్కసారి మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తే అది రెండు పంటలకు వినియోగించుకోవచ్చని అధికారులు తెలియజేశారు.

రైతులు సూచనలు పాటించాలి



మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు రబీలో కుందన్, నిర్మల రకానికి చెందిన దోస పంటలను మల్చింగ్ షీట్ విధానంతో సాగు చేశారు. ఇప్పటి వరకు 120 ఎకరాల్లో సాగైంది. 210 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. రైతులు పంటను బాగా చూసుకుంటూ సస్యరక్షణ చర్యలు చేపడితే పంట దిగుబడి బాగా వచ్చి అధిక లాభాలు పొందవచ్చు. సస్య రక్షణ చర్యల్లో అధికారుల సూచనలు పాటించాలి.

– జయభరత్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి, సిద్దవటం మండలం

ఎకరాకు రూ.లక్ష ఖర్చు వస్తోంది



కుందన్ రకానికి చెందిన దోస పంట 3 ఎకరాల్లో, ఒక ఎకరాలో ఖర్బూజ పంటలను మల్చింగ్ షీట్ ద్వారా సాగు చేశాను. ఎకరా దోస పంటకు రూ.లక్ష ఖర్చు అయ్యింది. మల్చింగ్ పద్ధతిలో మొక్కలు నాటుకోవడంతో కలుపు సమస్య పెద్దగా లేదు. డ్రిప్ ద్వారా వేసిన ఎరువులు గాలికి అవిరి కాకుండా మొక్కకు బాగా అందితే మంచి లాభాలు వస్తాయని విశ్వాసం ఉంది. పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్‌లో ధర ఉంటే చాలు.

– మాచనూరు వెంకటసుబ్బారెడ్డి, వెలుగుపల్లె, సిద్దవటం మండలం

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

సుండుపల్లె : మండల పరిధిలోని ప్రతి గ్రామంలో సోమవారం నుంచి పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులు, వాటి నివారణ, దూడలలో వచ్చే నట్టల నివారణకు సూచనలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సోమవారం సుండుపల్లి గ్రామంలోని ఈడిగపల్లి, రాచంవాండ్లపల్లిలో వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

నూతన నియామకం



జయనారాయణరెడ్డి

సంబేపల్లె : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రైతు విభాగం అధ్యక్షుడిగా శెట్టిపల్లె గ్రామానికి చెందిన జయనారాయణరెడ్డి నియమితులైనట్లు ఆయన ఆదివారం తెలిపారు. రెడ్డి కమ్యూనిటీ వ్యవస్థాపకుడు యర్రపురెడ్డి సురేంద్రారెడ్డి ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు అందినట్టు చెప్పారు. అన్ని రెడ్డి సంఘాల సమన్వయంతో రెడ్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి ఉద్యమించడంతోపాటు ఐక్యతకు కృషి చేస్తానని తెలియజేశారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



సంబేపల్లె: మహిమ గల రాయిపై మొక్కుకుంటున్న భక్తులు



సుండుపల్లె: దర్శనమిస్తున్న నాగారపమ్మ

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి కనిపించింది. మండల కేంద్రం శివారులో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయాన్ని శుద్ధి చేసి ముస్తాబు చేశారు. అనంతరం నల్లగంగమ్మ అభిషేకాలు, అర్చనలు, హారతులు ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అమ్మవారి ఎదుట ఉన్న మహిమ గల రాయి (బీజాక్షరాలతో ఉన్న రాయి)ని దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నాగారపమ్మ ఆలయంలో..

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ సంతానం లేని వారికి సంతానం ప్రసాదించి, భక్తుల కోర్కెలు తీర్చే బంగారు కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచింది. ఆదివారం వేకువజామునే పూజారులు అమ్మవారికి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు బోనాలు, తలనీలాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది వద్ద కొలువైన శ్రీ మల్లూరమ్మను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అంతకుముందు ఆలయ అర్చకులు అమ్మవారికి పూజలు జరిపి సుందరంగా అలంకరించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

పవన్‌కల్యాణ్‌ను సీఎం చేస్తే లోకేష్ డిప్యూటీ సీఎం అవ్వొచ్చు



మాట్లాడుతున్న రామసుబ్బయ్య

రైల్వేకోడూరు అర్బన్ : నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి చేసిన వ్యాఖ్యలను జనసేన సీనియర్ నాయకుడు ముద్ద పోలు రామసుబ్బయ్య తీవ్రంగా తప్పుబట్టారు. ఆదివారం టీడీపీ సమావేశంలో శ్రీనివాసులురెడ్డి చేసిన వ్యాఖ్యలపై రామసుబ్బయ్య స్పందించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతోంది. జనసేనతో పొత్తు కారణంగానే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాడనేది టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. కూటమి గెలుపులో జనసేన క్రియాశీలకంగా వ్యవహరించిందని, అలాంటి మా పార్టీ అధినేతకు ఉన్న హోదాతో సమానంగా నారా లోకేష్‌కు కట్టబెట్టాలని కోరడం ఏమిటని ఆయన శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నించారు. లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనుకుంటే మా పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను సీఎం చేయాలని, చంద్రబాబు కేంద్ర మంత్రి అవుతారని వీడియోలో చెప్పుకొచ్చారు. అలానే తమ పార్టీ శ్రేణుల సహకారంతోనే కడపలో శ్రీనివాస్‌రెడ్డి భార్య మాధవీరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిందనేది తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడీపీతో జనసేన పొత్తులో ఉంటే ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు జనసేన కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని చెప్పారు. టీడీపీ నాయకులు పొత్తు ధర్మం విస్మరించి మాట్లాడటం కరెక్ట్ కాదనేది తెలుసుకోవాలని సూచించారు. ఇకనైనా టీడీపీ నాయకులు ఏదైనా మాట్లాడే ముందు ఇతర పక్షాల గురించి కూడా ఆలోచన చేయాలని ఈ సందర్భంగా రామసుబ్బయ్య హితవు పలికారు.

భక్తి శ్రద్ధలతో అనంతపురమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

నందలూరు : కడప – చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు కన్యకా చెరువు సమీపంలో వెలసిన శ్రీ అనంతపురమ్మకు ఆదివారం భక్తులు, మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లను సమర్పించుకున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. కన్యకా చెరువు అలుగు పారితే నందలూరు గ్రామ పంచాయతీలోని ప్రజలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించుకోవడం ఆనవాయితీ. నాలుగు సంవత్సరాల తరువాత ఈ ఏడాది అలుగు పారడంతో ప్రజలు అమ్మవారికి ఉత్సవం నిర్వహించారు. ఉదయాన్నే ఆలయం వద్దకు చేరుకున్న మహిళలు స్వయంగా కట్టెలు పొయ్యిపై పొంగళ్లను తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కన్యకా చెరువు నీటి సంఘం అధ్యక్షులు బూశెట్టి వెంకటసుబ్బయ్య, గంటా గోపాలకృష్ణ, బెస్త సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, పెంచలయ్య, బాబు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో పొంగళ్లను పొంగిస్తున్న మహిళలు

‘రాజ్యాంగంపై విలువలేని వ్యక్తి అమిత్‌షా’



రాజంపేట రూరల్: అమిషా గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు



ఓబులవారిపల్లె: విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అన్నమయ్య జిల్లా నేతలు

రాజంపేట రూరల్ : భారత రాజ్యాంగాన్ని కాపాడతానని దేశ హోంమంత్రిగా పదవి చేపట్టిన అమిత్ షా రాజ్యాంగంపై విలువ లేని వ్యక్తి అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సీపీఎం జిల్లా సమితి సభ్యులు సి.రవికుమార్‌లు ఆరోపించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆదివారం హోం మంత్రి అమిత్‌షా ఆంధ్ర రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గో బ్యాక్.. గో బ్యాక్ అమిత్‌షా అంటూ నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, భారత రాజ్యాంగాన్ని అప్రతిష్టపాలు చేసే విధంగా అమిత్ షా వ్యాఖ్యలతో రాజ్యాంగబద్ధమైన పదవి చేపట్టడానికి అనర్హుడని మండిపడ్డారు. వెంటనే హోంమంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, సీపీఎం నాయకులు పందికాళ్ల మణితో పాటు వామపక్ష నాయకులు నాగేశ్వరరావు, రమణ, లక్ష్మీదేవి, రాఘవ, నాని, వెంకటేష్, లక్ష్మీకర్, విఠల్, కేశవులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

ఓబులవారిపల్లె : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన హోంమంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని విజయవాడ ధర్నా చౌక్ వద్ద అన్నమయ్య జిల్లా బీకెఎంయూ, సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షా విజయవాడ రాకను తాము వ్యతిరేకిస్తున్నామని తేల్చిచెప్పారు. ఇందుకు గాను ధర్నా చౌక్‌వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నామని, అమిత్ షా వెంటనే తిరిగి వెళ్లిపోవాలని వారు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించినందుకుగాను అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం నేత పండుగోల మణి, కార్యదర్శి తోపు కృష్ణయ్య, సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ మండలి రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరాం, ఓబులవారిపల్లి మండల కార్యదర్శి మల్లిక, రమణయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత సింగారెడ్డిపల్లి జట్టు



కొత్త సింగనమల క్రికెట్ టోర్నీ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

పెనగలూరు : మండలంలోని కొత్త సింగనమల గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో సింగారెడ్డిపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో సాతుపల్లి, సింగారెడ్డిపల్లి జట్లు ఫైనల్‌లో ఆదివారం తలపడగా సింగారెడ్డిపల్లి విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి క్రింద రూ. 40 వేలు, ద్వితీయ బహుమతి క్రింద రూ. 30 వేలు నగదు అందజేసినట్లు నిర్వాహకులు హరి తెలిపారు. పెనగలూరు హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీలో వెంకటరాజంపేట జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ. 20 వేలు నగదు అందజేశారు.

స్వచ్ఛతలో లోపించిన చిత్తశుద్ధి



క్రీడా మైదానంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో పాల్గొని ఖాళీ వాటర్ బాటిల్స్‌ను మైదానంలోనే పడేసి వెళ్లిన అధికారులు

- చిట్టడివిలా క్రీడామైదానం
- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఫొటోలకు పోజులిచ్చి మమ అనిపించారంటూ విమర్శలు

రాజంపేట టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన క్రీడామైదానం ఎంతో విశాలవంతంగా ఉంటుంది. అయితే దాదాపు సగం క్రీడా మైదానం క్రీడాకారులకు ఉపయోగపడని విధంగా తయారైంది. క్రీడా మైదానంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతూ చిట్టడివిని తలపిస్తోంది. ఈనెల 18వ తేదీ మున్సిపల్ అధికారులు ఇదే క్రీడా మైదానం నుంచి స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఆ కార్యక్రమం కేవలం ఫొటోలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయ, సచివాలయ సిబ్బందితోపాటు చిన్నపాటి బుల్డోజర్‌తో క్రీడా మైదానంలోకి ప్రవేశించే మార్గంలో పిచ్చి మొక్కల తొలగింపు పనులను చేపట్టారని, అయితే సెల్‌ఫోన్ కెమెరాలు క్లిక్‌మనగానే ఆ పనులను ఆపేసి ర్యాలీకి ఉపక్రమించారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు క్రీడా మైదానం లోపలికి వచ్చినా వారికి అడవిని తలపించేలావున్న పిచ్చిమొక్కలు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని క్రీడాకారులు విమర్శిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమ ర్యాలీని ఎంతో ఆర్భాటంగా చేపట్టి, కనీసం క్రీడా మైదానంలో పిచ్చిమొక్కలను తొలగించకపోవడంపై క్రీడాకారులు అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు. ఫొటోలు తీసుకోవడంపై చూపిన శ్రద్ధ అధికారులు మొక్కలు తొలగింపుపై పెట్టివుంటే కనీసం క్రీడామైదానం క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చేదని క్రీడాకారులు అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది వాటర్ బాటిల్స్‌లో నీళ్లు తాగి ఖాళీ బాటిల్స్‌ను క్రీడా మైదానంలోనే పడేయడం పరిశుభ్రతపై వారి నిర్లక్ష్యానికి పరాకాష్టగా మిగిలింది.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు

రాయచోటి (జగదాంబసెంటర్) : వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి మన్ననలు పొందాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డిలుసూచించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కింగ్స్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కొలిమి హరూన్‌బాషాలతో కలసి శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రుచి, శుచిలు అందిస్తూ వినియోగదారుల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఇర్ఫాన్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లె ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత పెనగలూరు



ఫైనల్‌లో తలపడుతున్న ఓబిలి, పెనగలూరు జట్లు

పెనగలూరు : సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌లో పెనగలూరు జట్టు విజేతగా నిలిచింది. గొబ్బూరు హరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొనగా ఫైనల్‌లో ఓబిలి, పెనగలూరు జట్లు తలపడ్డాయి. ఇందులో పెనగలూరు జట్టు విన్నర్‌గా నిలిచి రూ.15 వేలు నగదు, మెమెంటోను అందుకున్నారు. రన్నర్స్‌కు రూ.7 వేలు నగదు హరి చేతుల మీదుగా అందజేసినట్లు ఆర్గనైజర్ నరేష్ తెలిపారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు



చిన్నమండెం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి మండిపల్లి

గాలివీడు : రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని గుండ్లచెరువు పంచాయతీ పసుపులవాండ్లపల్లెలో పర్యటించారు. మంచినీరు, భూ సమస్యల గురించి పలువురు టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. వెలిగల్లు నీటిని నియోజకవర్గంలో ఉన్న 700పైగా పల్లెలకు చేర్చేందుకు రూ.240 కోట్లు, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి మరో రూ.270 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయచోటి నియోజకవర్గంలో పర్యటించనున్నారని అప్పుడు ఈ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి దగర ఆమోదం పొందేటట్లు చేయడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడుతానని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

రాయచోటి అర్బన్ : తమ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు అధిక నిధులను ఖర్చు చేస్తోందని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామం దూళ్లవారిపల్లె రోడ్డు నందు రూ.80లక్షలతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. మండిపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే సిమెంటు,తారు రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపం కనిపిస్తే సహించేది లేదంటూ కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

చిన్నమండెం : క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం మల్లూరు గ్రామంలో మల్లూరు యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు మంత్రి చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం క్రికెట్ టోర్నీ నిర్వాహకులు మంత్రిని గజమాలతో ఘనంగా సన్మానించారు.